క్లుప్తంగా

'గోదావరిలో ఈతకు వెళ్లొద్దు'

పలిమెల: ఇటీవల మేడిగడ్డ వద్ద జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఈత కొట్టడానికి, స్నానం చేయడానికి, చేపలు పట్టేందుకు వెళ్లొద్దని ఎస్సై జె.రమేష్ సూచించారు. ముఖ్యంగా పిల్లల ఎవరు కూడా వెళ్లొద్దని, తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, వారి చర్యలు, అలవాట్లపై నిఘా ఉంచాలని వివరించారు. అలాగే మైనర్ పిల్లలకు డ్రైవింగ్ చేసేందుకు వాహనాలు ఇచ్చిన వారి కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కాళేశ్వరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రములోని డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ పార్కు నందు ఆయుష్ శాఖ, శ్రీపరివార్ యోగ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ప్రతీ ఒక్కరు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీకి చెందిన పులిగంటి రమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడి మిత్రులు రూ.25 వేలతోపాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజబాబు, వెంకటేష్, కుమార్ యాదవ్, గాదం రాజు, అల్లెపు సతీష్, చెక్క గోపి, కమలాకర్, నరేందర్, ఏలుగుల సురేష్, బొల్లం నరేష్, పూల్యాల తిరుపతి, ఎలకంటి విజయ్, శంకర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

'బడి బాట'లో క్రీడలు

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడలను నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ తదితర ఆటను ఆడించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సోయం అనందరావు మాట్లాడుతూ చదువుతోపాటు వివిధ ఆటల్లో ప్రావీణ్యం సాధించాలని, ఆటలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, వెంకటరమణ, ఆనంద్, శ్రీకాంత్, కుమార్‌బాబు, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, రాజేష్, వస్య, శ్రీరంగంతో పాటు తదితరులు ఉన్నారు.

రేపు యోగా శిక్షణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యోగా గురువు ఎర్రంకని రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు యోగా శిక్షణను వినియోగించుకోవాలన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన కోరారు.

కేసు నమోదు

ఏటూరునాగారం: అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా గోవిందరావుపేట మండలం రాంనగర్ తండా ప్రాంతానికి చెందిన అజ్మీరా మౌనిక 20 లీటర్ల గుడుంబాతో తారసపడింది. ఈ మేరకు ఆమెను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఏటూరునాగారం: ఇసుకలారీ ఢీకొని ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. గోవిందరావుపేట మండలం పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బడే ఫణికుమార్ పని ముగించుకుని తన గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చిన్నబోయినపల్లి చింతలమోరి ప్రాంతంలో ఇసుక లారీ ఢీకొట్టగా అతని తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఎంజీఎంకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే తన వద్ద పుస్తకాలు ఉండడంతో వారి పిల్లల కోసం ఏటూరునాగారంలో బుక్స్ కొనుగోలు చేసుకొని వెళ్తున్నట్లుగా తెలుస్తోంది.

అద్దె భవనంలో గ్రంథాలయం

- ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్న పాఠకులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

మొగుళ్లపల్లి: పాలకుల పట్టింపులేనితనమో, అధికారుల నిర్లక్ష్యమోగానీ ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో మండల కేంద్రంలోని గ్రంథాలయం కొనసాగుతోంది. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి చాలా మంది వస్తే ఆరు బయట నిలబడాల్సిందే. దినపత్రికలు కూడా ఒకటి రెండు మాత్రమే వస్తున్నాయని వాటిని మాత్రమే చదవాల్సినా పరిస్థితి ఉందని పాఠకులు వాపోతున్నారు. గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని మండిపడుతున్నారు.

దినపత్రికలకే పరిమితం..

గతంలో గ్రామ పంచాయతీ భవనంలోనే గ్రంథాలయం కొనసాగినప్పుడు కొన్ని పుస్తకాలైనా ఉండేది. కానీ అద్దె భవనంలోకి వచ్చినప్పటి గ్రంథాలయంలో కేవలం దినపత్రికలు రెండు, మూడు మాత్రమే ఉంటున్నాయని వార పత్రికలు, మాస పత్రికలు నవలలు కాని లేవని పాఠకులు తెలుపుతున్నారు. యువతి, యువకులు పోటీ పరీక్షలకు కావాల్సినా సమాచారంతో పాటు విద్యా, ఉద్యోగ సమాచారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేవగానే సమాచారం కోసం ప్రజలు గ్రంథాలయాలకు పరుగులు తీస్తారు. అలాంటి గ్రంథాలయాలకు ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించకుండా చిన్నచూపు చేస్తున్నాయని పాఠకులు వాపోతున్నారు. దీంతో గ్రామీణ మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సరైన పుస్తకాలు ఉండకపోగా అభివృద్ధికి నోచుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు చొరవ చూపి గ్రంథాలయానికి భవనం నిర్మించడంతో పాటు కావాల్సినా సమాచారం లభించే విధంగా పుస్తకాలు నవలలు ఉండే విధంగా కృషి చేయాలని మండలంలోని పాఠకులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీల నుంచి లైబ్రరీ సెస్ ప్రతీ సంవత్సరం చెల్లిస్తున్న కూడా గ్రంథాలయాలు అభివృద్ధికి అధికారులు కృషి చేయడం లేదని పాఠకులు వాపోతున్నారు.

భవనం నిర్మించాలి



మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కేవలం వార్త పత్రికలు ఒకటి రెండు మాత్రమే ఉంటున్నాయి. నవలలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. పాఠకులకు అనువుగా ఉంటే విధంగా పక్కా భవనం నిర్మించాలి.

– చర్లపల్లి వెంకటేశ్వర్లు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



భూపాలపల్లి అర్బన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



కాటారంలో..

భూపాలపల్లి అర్బన్: భూ భారతి చట్టం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను విచారణ చేపట్టి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన రైతుల నుంచి 97 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామస్వామి, సర్వేయర్ శ్రీనివాసరావు, సిబ్బంది రాజు, మోహన్, రాజులు పాల్గొన్నారు.

కాటారం: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ప్రతాపగిరి, వీరాపూర్, మోరెపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు, భూ యజమానులు పలు భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. ప్రతాపగిరిలో 73, వీరాపూర్‌లో 119, మోరెపల్లిలో 32 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వాజేడు: ద్విచక్రవాహనం నడుపుతున్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పేరూరు రైతు వేదికలో గురువారం తమ పరిధిలోని గ్రామాల ప్రజలతో ఆయన అభయ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 20న స్పెషల్ డ్రైవ్ ఉందని ద్విచక్ర వాహనం ఉన్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం నకిలీ విత్తనాలు, సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. రాంపురం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



రేగొండ: మాట్లాడుతున్న నిశీధర్‌రెడ్డి



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న పాపయ్య

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

రేగొండ: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దుంపిల్లపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశ విధానాలు ప్రపంచానికే దిక్సూచిగా మారుతున్నయన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం త్వరలోనే నెరవేరబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోల్సాని తిరుపతిరావు, జిల్లా, మండల నాయకులు పెరుమాండ్ల తిరుపతి, దయ్యాల కిరణ్, తూర్పాటి మల్లేష్, గాలిఫ్, కొడగాని రాకేష్, శంకర్, రమేశ్, రాజు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వికసిత్ భారత్ సంకల్ప సభలు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు గీస సంపత్, భూపాలపల్లి మండలంలోని పంబాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పులుగుజ్జు రాజు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల పారదర్శక పాలన, అమలుపై కేంద్ర ప్రభుత్వం కృషిని బలపరచడానికి ఈ సంకల్ప సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బట్టు రవి, దొంగల రాజేందర్, శివనాత్రి వేణు, దామోదర్ రెడ్డి, గుండ బోయిన కృష్ణ, రఘురామ్, సుధాకర్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిట్యాల: డ్రిప్ పైపులు, పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి రూరల్: మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస యోజన) తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద బిందు, తుంపర సేద్యం కోసం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రిప్‌పైపులు, స్ప్రింకర్లు ఎమ్మెల్యే మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద ఎరువులు, పరికరాలు అందిస్తుందని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఏ. సునీల్‌కుమార్, కంపనీ అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాలు పంపిణీ

భూపాలపల్లి రూరల్: దివ్యాంగుల ఆత్మ గౌరవం కాపాడడమే ప్రజాప్రభుత్వ కర్తవ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని మల్లీశ్వరి అధ్యక్షతన దివ్యాంగులకు అలింకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ అమృత పథకంలో భాగంగా కిశోర బాలికలకు పౌష్టికరమైన పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన..

భూపాలపల్లి పట్టణం సుభాష్ కాలనీలో రూ.4 కోట్ల నిధులతో మినీ స్టేడియం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. ఈ స్టేడియానికి సావిత్రి బాయ్ పూలే పేరు పెడతామని హామీ ఇచ్చారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అదేవిధంగా ప్రపంచ సికిల్‌సెల్ వ్యాధినివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



కాటారం: భూమి పూజ చేస్తున్న నాయకులు

పలిమెల: మండలంలోని పంకెన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు అధికారులు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, హౌసింగ్ డీఈ శ్రీకాంత్, ఏఈ వినయ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని నాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం గురువారం కాంగ్రెస్ నాయకులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్ రాజ్, హౌజింగ్ ఏఈ రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాచారం గ్రామ శాఖ అధ్యక్షుడు కస్నూరి రవి, మండల ప్రధాన కార్యదర్శి మావురపు వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ ధరావత్ శారద రవి, రాజయ్య పాల్గొన్నారు.



పలిమెలలో..

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



భూపాలపల్లి అర్బన్: రక్తదానం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు



మొగుళ్లపల్లి: కేక్ కట్‌చేస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రేగొండలో..

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నూగూరు, కొండాపురం, గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఆనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అశీష, మనోహర్, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ

మండల పరిధిలోని మల్లాపురం, కర్రావానిగూంపు గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ రాఘవులు మాట్లాడుతూ.. గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నామన్నారు. దోమలు రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది రాజేష్, కరుణ తదితరులు ఉన్నారు.

వాజేడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సూత్రాలను పాటించాలని వాజేడు, పేరూరు వైద్యులు కొమరం మహేందర్, రాహిల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఘణపురం కాలనీలో మహేందర్ ఆధ్వర్యంలో సికిల్ సెల్‌పై ఇంటింటి సర్వేలను నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారికి మందులను ఇచ్చారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. పేరూరు వైద్యశాల పరిధిలోని చెరుకూరు, ములకనపల్లి గ్రామాల్లో డాక్టర్ రాహిల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గురువారం మండలంలోని రామాంజాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కోఆర్డినేటర్ రాగుల శంకర్ బృందం ప్రజలకు కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో కళాప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు మార్త రవి, గోల్కొండ బుచ్చన్న, రహీమోద్దిన్, రాజేందర్, విజయ్‌కుమార్, కిషన్, సాగర్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



మొగుళ్లపల్లి: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ లింగాల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో అత్యంత ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, సంతోష్, సుదర్శన్, అజయ్, శ్రావణి, ఉపాధ్యాయులు అంకుష్, మహేష్, ఎమ్మార్సీ సిబ్బంది వేణు, వసంత, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్, హకీంపేట, కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కోసం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలను మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్, పృధ్వీరాజ్, సమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మౌనిక

గోవిందరావుపేట: మహిళలు, బాలికలు, విద్యార్థినులు షీ టీమ్స్ సేవలు వినియోగించుకోవాలని షీ టీమ్ ఎస్సై మౌనిక అన్నారు. మండలంలోని పస్రా జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థినులకు షీ టీమ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక మాట్లాడుతూ.. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలు, తెలంగాణ మోడల్, రెసిడెన్షియల్, కేజీబీవీ స్కూల్స్ వద్ద నిరంతరం షీ టీమ్స్ బృందాల నిఘా ఉంటుందన్నారు. ఇబ్బందులు ఉంటే వెంటనే 100, లేదా షీ టీమ్ నంబర్ 87126 70115 కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పస్రా 2వ ఎస్సై సీహెచ్ ఎర్రయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.